




అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పేదల నిరసనాగ్రహం

ఇళ్ల స్థలాలు.. సాగుభూమి కోసం

సాగు భూమి, ఇళ్ల స్థలాలు, నష్టపరిహారం కోసం శ్రీసత్యసాయి జిల్లాలో పేదలు కదం తొక్కారు. సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పేదలు సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. హిందూపురం, పాలసముద్రం, చిలమత్తూరు, కొడికొండ చెక్ పోస్ట్ తదితర ప్రాంతాలకు చెందిన పేదలు గణేష్ సర్కిల్ నుంచి గోకులం మీదుగా ర్యాలీ చేపట్టారు. మండుటెండలో కలెక్టరేట్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగించారు.



కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించిన ఆందోళన చేస్తున్న పేదలు

- ◆ వ్యకాసం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా
- ◆ రెండు గంటలపాటు కలెక్టరేట్ నిర్బంధం
- ◆ పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని జెసి హామీ
- ◆ ఫిబ్రవరి 20వ తేదీలోపు పరిష్కరించకుంటే నిరవధిక దీక్షలు
- ◆ వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇళ్ల స్థలాలు, సాగుపట్టాలు, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో గత కొంతకాలంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నాడు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాలసముద్రం సమీపంలో నాసన్, బెల్ పరిశ్రమల కోసం కారుచౌకగా దళితుల భూములను ప్రభుత్వం లాక్కోందన్నారు. ఆర్ఆర్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించి, సరైన నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. కోర్టు ఉత్తర్వులను కూడా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. పేదల అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆచరణ మాత్రం అడుగడుగునా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారన్నారు. పేదల పక్షాన పోరాడాల్సిన టిడిపి, జనసేన పార్టీలు రాకదలిరా అంటూ అధికారం కోసం ఆర్రులు చాస్తున్నారే తప్పా పేదల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి పార్టీలు వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిధిలోని రొద్దం ప్రాంతంలో పేదలు సాగులో ఉన్న భూములను ఈ ప్రభుత్వం టింబక్టు సంస్థకు కట్టబెట్టిందన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో దళితుల భూములను అన్యక్రాంతం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేడన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆయన దృష్టికి తెద్దామంటే పోలీసులు వామపక్షాల నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారన్నారు. అరెస్టులతో పేదల సమస్యలను మరుగున పర్చాలే ప్రభుత్వం వ్యవహరించడం విచాకరం అన్నారు. పేదల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి పైపల్లి గంగాధర్, నాయకులు నారాయణ, వెంకటేశు, రాముడు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమయ్య, రమణ, కొండ వెంకటేష్, తిప్పన్న, మహిళా వ్యకాసం జిల్లా కన్వీనర్ వర్షిని, కో కన్వీనర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎం.ఇంతియాజ్

పది రోజుల్లోపు పరిష్కరిస్తాం

రెండు గంటల పాటు ఆందోళన చేసినా అధికారులెవరూ స్పందించకపోవడంతో పేదలు కలెక్టరేట్ గేటును తోసుకుని లోపలికి వెళ్లారు. వారిని నిలువరించలేక పోలీసులు చేతులెత్తేశారు. కలెక్టర్ రావాలంటూ నినాదాలు ఇచ్చారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేదల వద్దకొచ్చి మాట్లాడారు. ఇళ్ల స్థలాలు, సాగు భూమి పట్టాలు, నష్టపరిహారం తదితర సమస్యలను పది రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వారివద్దకొచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పది రోజుల్లోపు పేదలకు ఇళ్ల పట్టాలు, సాగు రైతులకు సాగు పట్టాలు, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చే విషయంపై విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జెసి హామీతో నాయకులు ఆందోళన విరమించారు. ఫిబ్రవరి 20వ తేదీ లోపు సమస్యను పరిష్కరించకుంటే 21వ తేదీ నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని వ్యకాసం నాయకులు తెలియజేశారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

- ◆ కులగణన సర్వేను వేగవంతం చేయండి
- ◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్యతో కలిసి జిల్లా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం స్పందన సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను పరిశీలించి నిర్ణీత కాలంలో వాటికి పరిష్కారాలు చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. వాలంటీర్ల ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులు కులగణన ప్రక్రియను వేగవంతం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు ఆయా మండలాల్లో జరుగుతున్న సర్వేతో పాటు ప్రభుత్వ పథకాల అమలు లక్ష్యసాధనపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఇప్పటికి జిల్లాలో 85 శాతం సర్వే పూర్తయ్యిందని ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీన వరకు ఆయా గ్రామ, వార్డు పరిధిలోని సచివాలయాల్లో ఏవైనా కారణాలవల్ల మిగిలిపోయిన కుటుంబాలు సర్వేకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలన్నారు. ఫిబ్రవరి 2 నుంచి 15వ తేదీ వరకు కులగనన డేటాను పరిశీలించి జాబితా సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల తుది జాబితా తర్వాత మరికొంత అవకాశం ఇచ్చినప్పటికీ లోపాలు సరిదిద్దకపోవడం సరికాదన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి తప్పుల్లేకుండా వారంలోగా పూర్తి స్థాయి జాబితాను తయారు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 6 ,7 ,8 క్లైమ్‌లను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదోని పోలీసుల అదుపులో 'పురం'మార్కెట్ యార్డ్ డైరెక్టర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, రహమాత్‌పురం 16వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఫారుక్‌ను సోమవారం కర్నూలు జిల్లా ఆదోని పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ నిమిత్తం అక్కడికి తీసుకెళ్లారు. ఫారూక్ ఉపయోగిస్తున్న వాహనం పలు చోరీల్లో పట్టుబడిందని, అందులో నేరస్తులను విచారించగా ఫారూక్ పేరు చెప్పడంతో ఆదోని పోలీసులు హిందూపురం వచ్చి వాహనం, డ్రైవర్‌తో సహా అదుపులోకి తీసుకుని ఆదోనికి తరలించారు. ఈ విషయంపై ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామిని వివరణ కోరగా ఫారూక్‌ను అదుపులోకి తీసుకున్న విషయం వాస్తవమే. ఆదోనికి తీసుకొచ్చాక విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. వైసిపి ముఖ్య నాయకుడైన ఫారూక్‌ను ఆదోని పోలీసులు తీసుకెళ్లడం అధికార పార్టీతో పాటు పట్టణంలో చర్చనీయాంశమైంది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరసేగౌడ్, ప్రభాకర్‌రెడ్డి

తిప్పేస్వామిని టిటిడి సభ్యుడిగా తప్పించాలి

మాజీ మంత్రి హెచ్‌బి.నరసేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

పార్టీ నిబంధనలకు విరుద్ధంగా, క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామిని టిటిడి బోర్డు మెంబర్ పదవి నుంచి కూడా తొలగించాలని మాజీ మంత్రి హెచ్‌బి.నరసేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అవినీతిని ఆధారాలతో సహా నిరూపిస్తా మన్నారు. పట్టణంలోని వైటి.ప్రభాకర్‌రెడ్డి నివాసంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామికి టికెట్ నిరాకరించడం, ఇటీవల నూతన సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన సభ జయప్రదం కావడంతో జీర్ణించు కోలేని ఎమ్మెల్యే తిప్పేస్వామి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు పోకల అశోక్‌బాబుపై తన అనుచరుల తో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో రూ. లక్షలు అక్రమంగా వసూలు చేసి ప్రతిపక్ష పార్టీ నాయకులకు ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఈరలక్కపను అధిక మెజార్టీతో గెలిపించి సిఎం జగన్‌కు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే తిప్పే స్వామి వైసిపి నాయకులపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రవిశేఖర్‌రెడ్డి, జిబి శివకుమార్, న్యాయవాది గోవర్ధన్‌రెడ్డి, గుడిబండ జడ్పిటిసి భూతరాజు, రొళ్ల ఎంపిపి విజయరంగేగౌడ్, పట్టణ అధ్యక్షుడు పుట్ట కామప్ప, అగళి మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాసులు, కౌన్సిలర్ లక్ష్మయ్య, ఒక్కలిగ డైరెక్టర్ నాగరాజుగౌడ్, నాయకులు సత్యనారా యణ, నాగరాజు, రమేష్, ఫణియాదవ్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

మడకశిర : పట్టణంలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ మంజునాథ్ తెలిపారు. ముఖ్య అతిథిగా సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి హాజరవుతారని, నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

అమరాపురం : మండల పరిధిలోని హేమావతి జడ్పీ హైస్కూల్‌లో సోమవారం సర్పంచి తిప్పే స్వామి అధ్యక్షతన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు ఫారాఖాన్, బిడి నరసింహమూర్తి, డీలర్ బైరప్ప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఐక్యత సభ కరపత్రాలు విడుదల

పెనుకొండ : బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సామాజిక ఐక్యత సభ' కరపత్రాలను సోమవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమస్యలపై నిష్ణాతుల చేత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. బహుజనులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, మునిమడుగు, నరసింహులు, రామకృష్ణ, శెట్టిపల్లి నరసింహులు, గిరిజన జాతి హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హరిలాల్‌నాయక్, నరసింహమూర్తి, హనుమంతునాయక్, లక్ష్మణ్‌నాయక్, ఆంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక ఐక్యత సభ కరపత్రాలు విడుదల చేస్తున్న శివరామకృష్ణ, తదితరులు

పార్లమెంట్‌కు పోటీ ఎవరు..?





- ◆ వైసిపికి తేలారు.. టిడిపిలో ఇంకా సందిగ్ధం
- ◆ స్పష్టతనివ్వని అధిష్టానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిధిలోని అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాలకు టిడిపి తరుపున అభ్యర్థులెవరన్నది చర్చ నడుస్తోంది. వైసిపి ఇప్పటికే రెండు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రెండు స్థానాలనూ బిసిలకే కేటాయించింది. టిడిపి ఇదే ఫార్ములాను పాటిస్తుందా లేక మార్పు చేస్తుందా అన్నది వేచిచూడాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి బిసిలకు కేటాయించగా, టిడిపి అనంతపురం పార్లమెంటు ఓసికి, హిందూపురం పార్లమెంటు బిసికి కేటాయించింది. ఈ రెండు చోట్లా టిడిపి ఓటమినే చవిచూసింది. ఈసారి ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థులుగా టిడిపి తరుపున ఎవరుంటారన్న దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్పులు చేపడుతుందా లేక గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన అభ్యర్థులనే మరోమారు బరిలో దింపుతుందా అన్న దానిపై స్పష్టత లేదు. 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందినప్పటి నుంచి టిడిపి అభ్యర్థులిద్దరూ పార్టీ కార్యక్రమాల్లోనూ అంత చురుగ్గా కనిపించలేదు. రాజకీయాలకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. లోకేశ్ పాదయాత్ర సమయంలోనూ జెసి.పవన్‌కుమార్‌రెడ్డి జిల్లాలో కనిపించలేదన్న చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల సమయంలోనూ వారి కదలికలు కనిపిండచడం లేదు. దీంతో టిడిపి ఈసారి అభ్యర్థులను మార్పులు చేసే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. వైసిపి అనుసరించిన బిసి ఫార్ములానే టిడిపి అనుసరిస్తుందన్న చర్చ నడుస్తోంది. అయితే ఈ మార్పుల్లో ఎవరిని అభ్యర్థులుగా ఖరారు చేస్తారన్నదే సర్వత్ర నడుస్తున్న చర్చ.

వైసిపి బిసిలకే ఇచ్చినప్పటికీ సామాజిక తరగతుల మార్పులు చేపట్టింది. 2019 ఎన్నికల్లో అనంతపురం పార్లమెంటు నుంచి బోయ సామాజిక తరగతికి చెందిన తలారి రంగయ్యను దింపింది. హిందూపురంలో కురుబ సామాజిక తరగతికి చెందిన గోరంట్ల మాధవ్‌ను బరిలో నిలిపింది. ఈసారి మాత్రం అనంతపురం పార్లమెంటుకు శంకర నారాయణను తీసుకొచ్చింది. హిందూపురం పార్లమెంటుకు కర్నాటకు చెందిన బోయ శాంతమ్మను సమన్వయకర్తగా నియమించింది. ఈ ఇద్దరూ ఆయా నియోజకవర్గం పరిధిలో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. అసెంబ్లీ స్థానాలకు కూడా సగం స్థానాలకు అభ్యర్థులను వైసిపి ఖరారు చేసింది. కాని టిడిపి ఇంకా అభ్యర్థులు ఒక్కరినీ ప్రకటించలేదు. మార్పులు, చేర్పులు చేస్తుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. ఫిబ్రవరి నాలుగో తేదీన తొలి జాబితా విడుదల చేస్తుందని ప్రచారం నడుస్తోంది. అందులో అసెంబ్లీకి ప్రకటిస్తుందా లేక పార్లమెంటు కూడా ఉంటాయా అన్నది కూడా స్పష్టత లేదు. అభ్యర్థులను టిడిపి ఎప్పుడు ఖరారు చేస్తుందోనని ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. ఒకవైపు అధికార వైసిపి అభ్యర్థులను ఖరారు చేసి జనంలోకి పోతుంటే టిడిపి ఇంకా ప్రకటించకపోవడంతో ఆశావహులు, అభ్యర్థుల్లోనూ అయోమయం నెలకొంది. ఎవరికి సీట్లు వస్తుయి.. ఎవరికి రావో తెలియక అధిష్టానం వైపు చూస్తున్నారు. త్వరగా అభ్యర్థులను ఖరారు చేయాలంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటీవల బాహాటంగానే మాట్లాడటం కూడా చర్చనీయాంశమైంది.

ఎన్నికల్లో బిసిల సత్తా చూపిస్తాం

'జయహో బిసి' సదస్సులో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుడిబండ

రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి బిసిల సత్తా చూపిస్తామని టిడిపి బిసి నాయకులు హెచ్చరించారు. టిడిపి ఆధ్వర్యంలో సోమవారం గుడిబండలోని సీనియర్ నాయకులు న్యాయవాది శివ కుమార్ ఇంటి ఆవరణలో 'జయహో బిసి' సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి, నియోజకవర్గం ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. అంబికా మాట్లాడుతూ జగన్ ప్రభు త్వం బిసి కార్పొరేషన్లు ఎత్తివేసి నిధులను దారి మళ్లించిందన్నారు. బికె మాట్లాడుతూ సైకో సర్కార్ బిసిలపై అక్రమ కేసులు బనాయించిందని, బిసి, మైనారిటీలకు ఇచ్చిన అసైన్డ్ భూములను లాక్కున్నార న్నారు. గుండుమల మాట్లాడుతూ బిసిలందరూ ఏకమై రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి సాగనం పాలని పిలుపునిచ్చారు. అంతకుముందు టిడిపి, జనసేన శ్రేణులు జెండాలు చేతబూని స్థానిక పలారం క్రాస్ నుంచి గుడిబండ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కన్వీనర్ మద్దనకుంట ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా దాదాపు వంద కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వారికి గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తి పసుపుకండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



గుడిబండలో టిడిపిలో చేరిన వారికి పసుపు కండువా వేస్తున్న గుండుమల



మడకశిర 'జయహో బిసి' సదస్సులో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి


వైసిపి పనైపోయింది.. వచ్చేది టిడిపినే

మడకశిర : 'జయహో బిసి' కార్యక్రమంలో భాగంగా రొళ్లలో గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యం లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సదస్సులో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడ మే లక్ష్యమని బిసి నాయకులు పేర్కొన్నారు. ముఖ్య అతిథి గుండుమల మాట్లాడుతూ జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ దాసిరెడ్డి, బిఎస్ గురుమూర్తి, పోతులయ్య, వడ్డే వెంకట్, శ్రీనివాస్, మనోహర్, కృష్ణమూర్తి, మంజునాథ్, కెఎన్ పల్లి సురేష్, శ్రీనివాస్, ఈరన్న, బాలకృష్ణ, రామకృష్ణ, దాసప్పపాలెం నాగరాజ, జిఎస్ యోగానంద, సిద్ధగంగప్ప, క్రిష్టప్ప, బ్యాడిగిన మూర్తి పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో ప్రజలందరూ బాధితులే'

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి పాలనలో ప్రజలందరూ బాధితులే అని, కావున వైసిపి ప్రభుత్వాన్ని, సిఎం జగన్‌ను ఇంటికి సాగనంపుదామని టిడిపి రాష్ట్ర కుంచిటి ఒక్కలిగ సాధికార సమితి అధ్యక్షులు విఎం.పాండు రంగప్ప పిలుపునిచ్చారు. ఆయన సోమవారం రొళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఏం చేశారని ప్రశ్నించారు. అన్ని కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పోలవ రం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్, సిపిఎస్ రద్దు, తదితర హామీలు ఏమయ్యాయని దుయ్యబట్టారు. మద్యం నిషేధించిన తర్వాతే ఓట్లు అడుగుతానన్న జగన్ ఎపిని కల్తీ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యా లకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని మండిపడ్డారు. అంగన్వాడీలు, 108, 104, మున్సిపల్, ఎస్ ఎస్ఎ ఉద్యోగుల ఎందుకు రోడ్డెక్కారో జగన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. పదే పదే అబద్ధాలు చెప్పడం, పేదల పక్షమని చెప్పడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. నియంత పాలనను తట్టుకోలేక జనం వైసిపిని ఘోరంగా ఓడించడానికి సిద్ధంగా ఉన్నారు.. ఓటమిని అంగీకరించేందుకు సిద్ధంగా ఉండాలని సిఎం జగన్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సన్నమారేగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ రామన్న పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగప్ప

అక్రమాలపై చర్యలకు డిమాండ్

కొత్తచెరువు : కొత్తచెరువులోని బీసీ కాలనీ సమీపంలోని గంగమ్మ గుడి వద్ద ఉన్న కాలనీలో వాటర్ ట్యాంకుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, సిపిఎం నాయకులు అంజి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ముత్యాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వాటర్ ట్యాంక్‌కు కేటాయించిన స్థలానికి నకిలీ పట్టా తీసుకొని రెవెన్యూ అధికారులు తనకు పట్టా ఇచ్చారని రాత్రికి రాత్రే పునాదులు వేసి ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. అదే విధంగా ఆ కాలనీలో 30 అడుగుల రోడ్డును కూడా ఆక్రమించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రామాంజనేయ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మన్న, పెద్దన్న, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

బుక్కపట్నం : మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి గ్రామ సమీపాన ఉన్న పోలీస్ ఫైరింగ్ రేంజ్ స్థలాన్ని ఎఆర్ ఎఎస్‌పి విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయి జిల్లా పోలీసుల ఫైరింగ్ శిక్షణ కోసం పోలీసులకు కేటాయించిన స్థలం జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉందన్నారు. ఈస్థలాన్ని ఫైరింగ్ కు అనుకూలంగా చదును చేసి త్వరలోనే ఫైరింగ్ రేంజ్ సౌకర్యాలు పూర్తి చేసి శిక్షణను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ధర్మవరం టౌన్ : పేదలకు పరమపిత వెంకటరమణాచార్య చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని టూటౌన్ సిఐ అశోక్ కుమార్ తెలిపారు. స్థానిక సిద్దయ్యగుట్టలోని పరమపిత వెంకటరమణాచార్య గురువు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం 12వ ఆరాధనోత్సవాల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని సిఐతో పాటు ట్రస్టు పీఠాధిపతి, వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీయోగి ముక్తేశ్వరీ మాతాజీ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ట్రస్టు వైస్‌ఛైర్మన్ అశోక్ కుమార్, కార్యదర్శి రామాంజనేయచారి, ఉపకార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

పూజారులకు గౌరవవేతనం ఇవ్వాలి

ధర్మవరం టౌన్ : మన గుడికట్లు సంప్రదాయాలను, కట్టుబాట్లను భావితరాలకు అందిస్తున్న పూజారులకు, గురవయ్యలకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని సిపిఐ రాష్ట్రనాయకుడు జగదీష్ కోరారు. ఈమేరకు పట్టణంలోని తారకరామాపురం అక్కమ్మగుడిలో సోమవారం మన గుడికట్లు-మనసంప్రదాయ పోస్టర్లను ఆయనతోపాటు నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుబల సాంప్రదాయాలు కట్టుబాట్లు ఉట్టిపడే విధంగా క్యాలెండర్‌ను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముసుగుమధు, పామాల కులశేఖర్, పాలసూరి, గుంజర శివయ్య, బుడగ వెంకటనారాయణ, మల్లికార్జున, నాగేంద్ర, గస్తిఅనిల్, గుంజరశివ, చంద్రశేఖర్, గోసికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

ముదిగుబ్బ : మండలంలోని 33/11కేవీ మలక వేముల సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ శివతేజ తెలిపారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కదిరి క్రీడాకారులు

కదిరి టౌన్ : గుంటూరు జిల్లా నర్సరావుపేట పేట లో జరిగే ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు కదిరి క్రీడాకారిణిలు ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. గుంటూరు జిల్లా నరసరావుపేట లో అండర్ 17 రాష్ట్ర స్థాయి (ఎస్‌జిఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల క్రికెట్ పోటీలలో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరపున కదిరికి చెందిన వింధ్య, జాగృతి, తేజస్విని ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు.ఈ పోటీలలో వీరు రాణించి మరింత అభివృద్ధి చెందాలని సీనియర్ క్రీడాకారులు, పాఠశాల యాజమాన్యం, పిఇటిలు, కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షులు కందికుంట వెంకట ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు .

బాలికల కళాశాలలో ల్యాబ్ ప్రారంభం

కదిరి టౌన్ : నూతన టెక్నాలజీ తో కళ్ల ముందే విద్యార్థులకు ప్రాజెక్టుల రూపాకల్పన సాధ్యం అవుతుందని మండల విద్యాధికారి చిన్నకృష్ణ, ప్రిన్సిపల్ ప్రశాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎంఎస్. ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన అటల్ టింకరింగ్ ల్యాబ్ ను సోమవారం మండల విద్యాధికారులు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

పరిగి : పరిగి సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్ అత్త నరసమ్మ సోమవారం ఉదయం మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతిచెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి పెనుగొండ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి పరిగి లోనే శివశంకర్ నివాసానికి వెళ్లి నరసమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కేటి శ్రీధర్ బాధితులను పరామర్శించారు.

హామీని నిలబెట్టుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిఆర్‌డిఎ, వైఎస్ఆర్ క్రాంతి పథకం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం మూడో రోజు డిఆర్‌డిఎకార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నిరవధిక నిరాహార దీక్షలో ఎపిఎం ముత్యాలప్ప, లక్ష్మీనారాయణ, హేమలత, సీసీలు సుగుణ, చౌడయ్య కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐకెపి ఉద్యోగులకు హామీ ఇచ్చారన్నారు. తాము అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని వారి సమస్యలు తీర్చుతామని అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చారని గుర్తు చేశారు. ఆ మాటలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తారని నాలుగున్నర సంవత్సరాల పాటు ఎదురు చూశామని తప్పనిసరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు పూనుకున్నామని చెప్పారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించబోమని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ బాబుకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని గుడిబండ దేవరాజ్, రామాంజినప్ప ,అశ్వ తప్ప, సుధాకర, శివమ్మ, సుజాత, రామాంజనేయులు, జేఏసీ కన్వీనర్ రామేశ్వర్ రెడ్డి, రామమోహన్, సీసీలు శంకర్, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న సెర్ప్ ఉద్యోగులు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మట్టి మాఫియాపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు పంచాయతీ పరిధిలోని కారుడిపల్లి చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా యంత్రాలను ఏర్పాటు చేసి మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని కారుడిపల్లి గ్రామస్తులు అధికారులను కోరారు. మండలంలో అను మతులు లేకుండా అక్రమ మట్టి రవాణాపై ప్రజాశక్తిలో 'పేట్రేగిన మట్టి మాఫియా' అనే శీర్షికతో ప్రత్యేక కథనం వెలువడింది. ఈ కథనానికి గ్రామస్తులు స్పందించారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి తహశీల్దార్ స్వర్ణలతకు, ఇరిగేషన్ కార్యలయం ముందు ఆందోళన చేసి డిఈఈలకు వినతిపత్రాలు అందజేశారు. అక్రమ మట్టి రవాణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మట్టితరలింపును అడ్డుకున్న గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులపై పెట్టిన కేసులను ఎత్తివేసి, అక్రమంగా మట్టిని తరలించిన రామకృష్ణపై కేసు నమోదు చేసి యంత్రాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మంజూనాథ్ గౌడ్, అంజి, గోపీనాథ్ రెడ్డి, శివయ్య, నరసింహమూర్తి, చందు, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించి తప్పులను గుర్తించాలని జనసేన నాయకులు, కార్యకర్తలకు ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని జనసేనపార్టీ నూతనకార్యాలయంలో పట్టణ, రూరల్ బూత్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తుది ఓటరు జాబితాను సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార వైసీపీ దొంగ ఓట్లతో ఎలాగైనా ఈ సారి కూడా గెలుపొందాలని ప్రయత్నిస్తోందని, వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఓటరు జాబితాను తీసుకుని ప్రతింటికి వెళ్లి నిశితంగా పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించాలని సూచించారు. అదేవిధంగా ధర్మవరం మండల జనసేన కమిటిని ఎంపిక చేశారు. మండల అధ్యక్షులుగా నాగసుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరికచిరంజీవి, శివ, శంకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులుగా చిరంజీవి, జయరాం, శైలజ, రాజశేఖర్‌రెడ్డి రాజు,కార్యదర్శులుగా సుధాకర్, పెద్దన్న, పెక్షావలి,రవి, గోవిందరెడ్డి, బాబురెడ్డి, సుబ్బన్న, మౌలాలి, సంయుక్త కార్యదర్శులుగా రమేశ్ పి.రాజశేఖర్‌రెడ్డి, నాగార్జున, అంగజాల వంశీ, రాము, కృష్ణమూర్తి, ప్రతాప్‌ను ఎన్నుకున్నారు. వారికి చిలకం మధుసూదన్‌రెడ్డి నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మత్స్యకార విభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్త శ్రీనివాసులు, పట్టణ నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు కొటికి రామాంజి, పేరూరు శ్రీనివాసులు, దాడితోటలక్ష్మయ్య, బాలకృష్ణ, కోలానాగార్జున, దాము, రాజప్రకాశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు త్వరతగతిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ ఆదేశించారు. ఛైర్‌పర్సన్ అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వార్డు కౌన్సిలర్లు పట్టణంలోని పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమావేశంలో సమస్యలు తెలిపినా వాటిని పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ బండి శేషన్న దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పలు సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, వైస్ ఛైర్మన్లు వేముల జయరాంరెడ్డి శంషాద్ బేగం, మాజీ వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కదిరి బాలుడికి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - కదిరి అర్బన్



సిపి. మనీష్‌కుమార్

బెంగుళూరులో ఈనెల 27,28 నిర్వహించిన 6వ విపా నేషనల్ తైక్వాండో ఛాంపియయన్‌షిప్ 2024లో కదిరికి చెందిన బాలుడు గోల్డ్‌మెడల్ సాధించాడు. అండర్-14 (38 కేజీల) విభాగంలో కదిరికి చెందిన సివి మనీష్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. పుమ్ సే యు-14(38 కేజీ) విభాగం లో సిల్వర్ మెడల్ సాధించాడు. మనీష్ హైదరాబాద్‌లోని ఓయాసిస్ స్కూల్‌లో కోచ్‌లు భాస్కర్, నాగరాజ్ వద్ద రెండు సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నట్లు మనీష్‌కుమార్ తండ్రి, న్యాయవాది సీవీ కృష్ణమూర్తి తెలిపారు. సివి మనీష్‌కుమార్‌కు గోల్డ్ మెడల్ రావడం గర్వకారణంగా ఉందని ఆయన అన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపెందించుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విద్యార్థులకు సూచించారు. సోమవారం కదిరి పట్టణంలోని అమృత ఫంక్షన్ హాల్‌లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ నాయకత్వ లక్షణాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కందికుంట వెంకట ప్రసాద్‌లో పాటు జనసేన పార్టీ నాయకులు శివశంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రభుత్వ,ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - తలుపుల

వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జీవనజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలో పాటు వైసిపి సిఇసి సభ్యులు పూలశ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అందజేస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఓబులేశ్వరమ్మ మహేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటీసీ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి గాండ్లపెంట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధికారులు కరువయ్యారు. కేవలం ఐదు శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహశీల్దార్, ఇఒఆర్‌డి, సెరికల్చర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఎపిఒ మినహా మిగతా శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజలు సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు గైర్హాజరు కావటాన్ని బట్టి చూస్తే వీరికి ప్రజాసమస్యల పరిష్కారంపై ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ హమీద్‌బాషా మాట్లాడుతూ మండలంలో 27 శాఖలు ఉండగా ఐదు శాఖల అధికారులు హాజరయ్యారని చెప్పారు. మిగిలిన 22 శాఖల అధికారులు గైర్హాజరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



స్పందనకు హాజరైన అధికారులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని టీడీపీ అధికార ప్రతినిధి బండారు మనోహర్ నాయుడు సూచించారు.. సోమవారం పట్టణంలోని ఎస్‌వికె ఫంక్షన్ హాల్ లో క్లస్టర్ బూత్ స్థాయి కార్యకర్తలతో ఇంటి గ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించే ప్రతి అంశాన్ని క్యాడర్ అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మండల కన్వీనర్ చెన్నకేశవులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ట్రైనర్ వేణు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బాషా ,రమణ, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని టైలరింగ్ సెంటర్‌లో టిడిపి నాయకులకు ఆపార్టీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శిక్షకురాలు బేబీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జులు జెరిపిటి రవి, పిజి.మల్లికార్జున, నాయకులు సరోజమ్మ, మహబూబ్‌బాషా, శ్రీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రమణయ్య, ఓబులేసు, శంకర్ నాయుడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మున్సిపల్ కార్యాలయ అటెండర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



చికిత్స పొందుతున్న క్రిష్ణ

కుటుంబసమస్యలు ఒకపక్క, మరో పక్క వైసీపీ కౌన్సిలర్ వేధింపులతో మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే అటెండర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం ధర్మవరంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయ అటెండర్ క్రిష్ణ ఆత్మహత్యాయత్నానికి ముందు తానే తీసిన వీడియో సోషియల్ మీడియాలో వైరల్‌గా మారింది. టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న తాను ఇటీవల కాలంలో కుటుంబసమస్యలతో సతమతమవుతున్నానని చెప్పాడు. తన మొదటి భార్య, కుమారుడు తరచూ గొడవ పెట్టుకుంటూ తనకు మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారని విడియోలో వాపోయాడు. ఆదివారం కూడా తనపై మొదటి భార్య, కుమారుడు గొడవకు వచ్చారన్నారు. దీనికి తోడు వైసీపీ కౌన్సిలర్ జేసీబీ రమణ కూడా తనను సస్పెండ్ చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. గత కౌన్సిల్‌మీట్‌లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారన్నారు. కుటుంబ సమస్యలు, కౌన్సిలర్ వేధింపులతోనే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నానని చెబుతూ సూపర్‌వాజ్మోల్ తాగాడు. ఇదంతా తీసిన వీడియోను మున్సిపల్ సిబ్బందికి పంపడంతో వెంటనే సిబ్బంది కార్యాలయంలో గాలించారు. కార్యాలయంపైన అపరస్మారక స్థితిలో పడి ఉన్న అటెండర్ క్రిష్ణను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు : మండలంలోని చౌడంపల్లి గ్రామానికి వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన రామాంజనేయులు(31) సోమవారం తన ఇంటిలో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజినేయులు, ఆయన భార్య గత కొన్ని రోజులుగా గొడవ పడుతున్నారు. దీంతో నాలుగు రోజులు క్రితం రామాంజనేయులు భార్య వరలక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన రామాంజనేయులు సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషపు గుళికల మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన బంధువులు కదిరి ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. అప్పటికే రామాంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతునితండ్రి చిన్న వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాముడు తెలిపారు.

బొలెరో బోల్తా

ప్రజాశక్తి బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని బత్తలపల్లి రైస్‌మిల్ సమీపంలో సోమవారం అరటి పండ్లతో వెలుతున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వైఎస్సార్ కడప జిల్లా పార్నపల్లి నుంచి కర్నాటకలోని బీజాపూర్‌కు అరటి పండ్ల లోడ్‌తో వెళుతున్న బొలెరో బత్తలపల్లి రైస్‌మిల్ వద్దకు రాగానే ముందు వెలుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నుంచి డ్రైవర్ మధు, సందీప్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వాహనం రోడ్డుపై అడ్డంగా బోల్తా పడడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గుట్టకిందపల్లి వద్దగల పెట్రోల్ బంక్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని కేతిరెడ్డికి కాలనీకి చెందిన రామలింగప్ప ద్విచక్రవాహనంలో అనంతపురానికి బయలు దేరాడు. గుట్టకిందపల్లి పెట్రోల్ బంక్ వద్దకు రాగానే అక్కడి నుంచి జేసీబీ అకస్మాత్తుగా వచ్చి రామలింగప్ప ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామలింగప్ప తీవ్రం గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఫిర్యాదులపై సకాలంలో స్పందించండి

పుట్టపర్తి రూరల్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందనలో వచ్చే పిటిషన్లపై పోలీసు అధికారులు సకాలంలో స్పందించి అర్జీలు విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ విష్ణు, డిసిఆర్‌బి సిఐ శ్రీ హర్ష , లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన బీసీ నాయకులు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బీసీ నాయకులు సోమవారం ఉండవల్లిలో నారా లోకేష్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు పీసీ గంగన్న, దలవాయి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న, జరిపిటి కృష్ణమూర్తి తదితరులు లోకేష్‌కు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. వీరు పుట్టపర్తి నియోజకవర్గం సమస్యలపై దాదాపు గంట పాటు చర్చించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పుట్టపర్తిలో తెలుగుదేశం జెండా ఎగురవేయాలని ఈసందర్భంగా లోకేష్ వారికి సూచించినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ తరపున బడుగు బలహీన మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థిని నిలబెట్టాలని లోకేష్‌ను కోరినట్లు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి నాయుడు, అనంతపురం పుల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి యువకులకు బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ యాక్టర్ అవార్డు

కదిరి అర్బన్ : కదిరిలో ఆసక్తికరంగా వెబ్ సిరీస్, షార్ట్ ఫిలిమ్స్ చేస్తున్న యువకులు అనంత షార్ట్ ఫిలిం అవార్డుకు ఎంపికయ్యారు. అనంతపురం నగరంలో జరిగిన అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ఫంక్షన్లో దోస్తాన్ మూవీ నిర్మాత, డైరెక్టర్ అక్కమ్మ గారి సూర్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇగ్బో, పొలిమేర లఘు చిత్రాలకు అవార్డు అందించారు. బెస్ట్ డైరెక్టర్ గా బాదుల్లా, బెస్ట్ యాక్టర్ గా పవన్‌కి అవార్డులు అందజేశారు. డైరెక్టర్ బాదుల్లా మాట్లాడుతూ తనకు ఎల్లప్పుడూ తమ వెంట ఉండి ముందుకు నడిపిస్తున్న సూర్యనారాయణకి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీ అధికారికి సన్మానం

బత్తలపల్లి : బదిలీపై కర్నూలు జిల్లాకు వెళుతున్న ఎంపిడిఒ విజయలక్ష్మిని ఎంపిపి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిస్థితులపై అవగాహన

కొత్తచెరువు రూరల్: మండల పరిధిలోని కొడపగానిపల్లి రైతులతో తిరుపతి విశ్వ విద్యాలయ విద్యార్థులు సోమవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వ్యవసాయ పరిస్థితులపై అవగాహనర కల్పించారు. తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం బీఎస్సీ ఏజీ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల వ్యవసాయ పరిస్థితులపై అవగాహన, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సర్పంచి అలివేలమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రామసుబ్బయ్య, రవి కిషోర్ విద్యావతి వ్యవసాయ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారుఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, ఏవో నటరాజ్, విఎఎ కౌశిక్ ఆదినారాయణ రెడ్డి, సురేందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీకి ఉత్తమ అవార్డు

ధర్మవరంటౌన్ : పట్టణంలోని దుర్గానగర్-2 సచివాలయంలో పనిచేస్తున్న ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ రాఘవేంద్రకు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు లభించింది. ఈనెల 26న కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా రాఘవేంద్ర అవార్డు అందుకున్నారు. సచివాలయంలో చేసిన సర్వీసులతోపాటు ఆధార్ సర్వీసు సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు ఇచ్చినట్టు సెక్రటరీ రాఘవేంద్ర తెలిపారు. అవార్డు రావడంపట్ల తోటి సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు రాఘవేంద్రను అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న రాఘవేంద్ర